# ఆకురాలు ఋతువు

రచన:

ఎం. ఏ. అజీజ్

పరిచురణకు స్వీకరించిన

పోటీ కథానిక

శ్రీవారి పాదపద్మములకు.

నమస్కారములు

సట్టుదలతో, ఆవేదనతో, కన్నీళ్ళతో మీకీ ఉత్తరం రాస్తున్నానని మీరు ఊహించరు. కనీసం మీరలా అనుకున్నా తృప్తి పడేదాన్ని... కాని ఎలా ఊహిస్తారు? అయినా ఆనాడు అనుభవించిన జీవిత మాధుర్య చిహ్నాలు కనీసం వాటి రూపాలైనా మీకు జ్ఞాపకం లేవా? ఇలా ఆలోచిస్తుంటే ఆనాటి మీరు యీనాడు కారేమో ననిపిస్తుంది.

జీవితంలో నేను సాధించాలనుకుంది సాధించాను. అది మీరు. కాని ఎంత బాధ? ఎంత దిగులు?? వెయ్యి జన్మలెత్తినా నా బాధను, నా ఆవేదనను అర్థం చేసుకుంటారా? కాని.... ఏమిటో జీవితం యింత వికృతంగా, అసహ్యంగా వుంటుందనుకోలేదు.

ఆనాడు మీరు చెయ్యెత్తి నా చుబుకాన్ని పట్టుకొని. "రాధ లేంది యీ చక్రవర్తి లేడని।" అన్నారు. కాని ఏది? ఏం చేశారు? నాకెందుకింత చిత్రవధ? చివరికి మీరేం సాధిస్తారు? తలచుకుంటే బ్రతుకుమీద అసహ్యం కలిగి ఏడుస్తున్నాను.... నమ్మలేరా?

అయినా నాక్కావలసింది మీ సుఖమే. మీరు సుఖంగా వుంటే నాకదే పదివేలు. ఇవాళ కాకపోయినా రేపు.... ఎప్పుడైనా మీరొస్తారనే ఆశ.... నా కలలు నిజమౌతాయి. అప్పుడు. నాకు అంతకన్నా కావలసిందే ముంది? ఎప్పుడైనా ఆలోచిస్తారా?

ఏదో సినిమాల్లో, కథల్లో అన్నట్లుగా వున్నాయి నా మాటలు. మీరు నవ్వుకోవచ్చు. కాని నిజంకూడా అంతే। మీకు అసహజంగా కనిపించవచ్చు. స్వల్పంగా వుండవచ్చు. కాని నేను దీన్నే ఎక్కువగా పూజిస్తాను ఆశలోనే ఒరిగిలు పడిపోతాను. ఇంకా నన్ను పరీక్షి చేయకండి। భరించలేను. నా గుండెలు పగిలి పోతున్నాయి।

నిర్మానుష్యమైన యీ కొంపలో సాయంత్రపు ఎండ కిటికీ ఊచల్లోంచి మీ యీ ఉత్తరంమీదపడి ఎండల మైళ్ళ దూరంలో వున్న మీ ఛాయను........కాని చీకటిపడ్డ తరువాత యీ ఉత్తరాన్ని పోస్టు చేయటానికి చేతులెలా వస్తాయో। ఒకవేళ మీ నాన్నగారి చేతుల్లో యీ ఉత్తరంపడ్తే ఆ రోజు యింటి పరిస్థితి ఎలా వుంటుందో నేను ఊహించగలను. కాని యింకా ఎన్నాళ్లు యీ రహస్యం? కనీసం నా యిన్ని ఉత్తరాలకు ఒక్క సమాధానం కూడా యివ్వరేం? "ఇక ముందు నాపేర ఉత్తరం వ్రాయవద్దని" కూడా శాసించరేం? అబ్బ। సంతోషాల్సి. చివరికి మనసుని కూడా లాక్కుని అందకుండా ఎంతదూరమయ్యారు? పెళ్ళినాడు చేసిన ప్రమాణాలు యివేనా? నా జీవితంలో ప్రతి క్షణాన్ని మీకోసం ధారపోశాను. నేనెంతో అదృష్టవంతురాలిని ననుకొని మురిసిపోయాను. ఎన్ని రాత్రులు మీ జ్ఞాపకంలో గడిపానో. నా లోకంలో, నా కలల్లో, ఆ ఊహల్లో మీరే.... నిజం మీరే। నమ్మండి।

అర్థరాత్రి.... వెన్నెట్లో నా జీవితానికి అర్థంలేదని యీ వెన్నెలకు కూడా అర్థంలేదని ఎలా తూంనాడను? ఈ వియోగంలో యీ విరహాన్ని ఎలా భరించను? రండి.... నాదగ్గరికి... ఎప్పుడు కనిపిస్తారు?

అక్కయ్య బ్రతికున్ననాళ్ళు.... యీ బాధను కొంతవరకు మరచిపోయేదాన్ని. ఇప్పుడుకూడా మునుపటిలాగా 'దేవిగారు వున్నారా....?' అని వస్తుంటారు కొందరు. 'ఎందుకు ...?' అనడిగితే ఎవరూ సమాధానమివ్వరు. ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటారు. బహుశ నా ప్రశ్న వాళ్ళకు వింతగా వుంటుందేమో।' చివరికి చాతగాక 'లేరు' అనంటాను, 'ఎక్కడికి కెళ్ళారని'మాత్రం అడగరు. వెళ్ళిపోతారు.... అంతే। మీకు జ్ఞాపకానికొస్తాయి. నమ్మి నన్ను మీ చేతుల్లో పెట్టినందుకు నా అక్కయ్య ఆత్మకు ఏం శాంతినిచ్చారు? మీరు ఎదురుగా వుంటె బహుశ యీ ప్రశ్న అడిగేదాన్ని కాదేమో। మీరు ఏపరిస్థితిలోవున్నా బాధపడేదాన్నికారు.... కాని.... యీ .... దూరం .....।

జీవితంలో సర్వం త్యజించాను.... లోకులు కాకులయ్యారు. భరించాను ధర్మం కాబట్టి. నామీద ఎన్నోకథలల్లారు. ఓర్చుకున్నాను. చాతగాక, కాని ఇవన్నీ ఎవరికోసమో ఆలోచించారా? కాని ఏదోతృప్తి ఇన్నాళ్ళు మీ జ్ఞాపకంలోనే పవిత్రంగా బ్రతికాను మమతల్ని పెంచుకున్నాను. మీరు నావారు అని చెప్పుకునేందుకు యీ బంగారపు తాళిబొట్టు.... జీవితంలో ఎలాంటి సుఖాల్ని అనుభవించకపోయినా మీ యీ జ్ఞాపకం మిగిలింది.... నాకు....

మీరొస్తే యింకా కొన్నాళ్ళు....కొన్ని ఘడియలైనా బ్రతుకుతాననే నమ్మకంతో

మీ

రాధ.

పరంధామయ్య కుప్పకూలి పోయాడు. గుండెలు బద్దలయ్యాయి. నీరసంగా నిస్సత్తువగా కుర్చీలో కూలబడ్డాడు.

ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నాడు

మనసు కరిగింది....

కన్నీళ్ళను ఆపుకోలేకపోయాడు.

చిన్నగాలేచి చక్రవర్తి గదిలోకెళ్ళాడు.

గోడమీద చక్రవర్తిఫోటో చిన్నగా నవ్వుతుంది....

ఇల్లంతా నిశ్శబ్దంగావుంది....

ఇంతకుముందు రాధరాసిన ఉత్తరాలు టేబుల్ మీద చిందర....వందరగా పడున్నాయి. శరీరమంతా వణికింది....

అక్కడే కుర్చీలోకూర్చుని ఒక్కొక్క ఉత్తరాన్ని విప్పి చదవసాగాడు.

శ్రీవారికి........

ఇంటికి సున్నం వేస్తున్నారు. ఎత్తుగా పెరిగిన దిరిసెనచెట్లనీడలో కూర్చొని వ్రాస్తున్నాను యీ ఉత్తరం.... మీ అదృష్టానికి అసూయగా వుంది నాకు.... కోపం వచ్చిందా? అబ్బ! ఊరికేఅన్నాను.... నేనుమాత్రం అదృష్టవంతురాలినికాదు....! ఎందుకు నవ్వుతారు....? నిజం....!

అవును! నెలరోజుల్లోనే వచ్చినన్ను తీసుకెళ్తానన్నారు.... నెలపోయి నాలుగు నెలలయింది.... ఏది? యింకారాలేదేం? ఇంకా మీనాన్నగారు ఒప్పుకోలేదా....? ఒప్పించండి....! కాకపోతే నాకనుమతివ్వండి— నేనొచ్చి వారి కాళ్ళ మీద పడ్తాను. అప్పటికీ ఒప్పుకోరంటారా....? ఎందుకో భయంగావుంది. ఆలోచిస్తూంటే మనం తొందర పడ్డామేమోననిపిస్తుంది.

అక్కయ్య హడావిడిగా తిరుగుతుంది. రెండుమూడుసార్లు మిమ్మల్ని అడిగింది. వస్తారు....' చల్లనిరాత్రి చక్కదనంలో నారాజు రేరాజులాగావస్తారు! అనన్నాను. త్వరలో వచ్చేస్తారుకదూ! మీ జ్ఞాపకంలో

మీ

రాధ

పరంధామయ్య మరోఉత్తరం విప్పాడు.

శ్రీవారి పాదపద్మాలకు....

నమస్కారములు.

అబ్బ! యీ ఒంటరితనం గడపలేనండి నా మాటలు గమ్మత్తుగావుండవచ్చు మీకు. కాని ఏం చెయ్యను? మూగదానిలా ఒంటరిగా ఎంతకాలం యిలా వుండను? నిజముగా మీకు జాలికలగదు నామీద! ఐనా నా మనసును సంతుష్టిపరచగల యీ .... సాయంత్రపు యెండలు అలల నీలాలు. అబ్బ మీ జ్ఞాపకం ఎంత తియ్యగా.... ఛీ! సిగ్గులేదు నాకు!

ఇంటిపనులు చేసుకుంటు మేడ మీద గదిలో కిటికీలోంచి పడే బంగారపు ఎండలో మీరు కుర్చీవేసుకుని కూర్చున్నారేమోనని గబగబ చేస్తున్నపని మధ్యలో ఆపేసి వెళ్తే.... నాపిచ్చికి అక్కయ్య నవ్వుకుంది.... ఎంత సిగ్గుపడ్డానో మీకేం రాయను?

అక్కయ్య ఆరోగ్యం బాగాలేదు.... మందు తీసుకోదు.... మిమ్మల్ని చాలాసార్లు అడిగింది— 'ఉత్తరం వచ్చింది.... తొందర్లోనే వస్తారట!' అని అబద్ధమాడాను.... అక్కయ్య నవ్వింది........ ఎందుకో నాకేం అర్థంకాలేదు.... తొందరగా వచ్చేస్తారు కదూ! మీ రాక కోసం బ్రతికే—

మీ

రాధ

మీకు....

ప్రస్తుతం నా ఉనికి మీ కవసరం లేదనుకుంటాను. కాని మీకు నాకెంతో అవసరం.... యిప్పుడు చీకటంటే విచారములేదు. పిచ్చివాడికి వెలుగూ, చీకటీ రెండూ ఒకటే! నాకూఅంతే ననిపిస్తుంది అవును....! మీరులేంది ఎందుకు యీ బ్రతుకు? పిచ్చికాక మరేమై వుంటుంది?

దిరిసెనచెట్లు ఆకుల్ని రాలుస్తున్నాయి హృదయంలో చీకటివర్షిస్తుంది.... అప్పుడే మొదలైందా ఆకురాలు ఋతువు? నాకూ దానికీ ఎంత సన్నిహితం!

ఎన్ని యుగాలనుంచో మనకీ ఎడబాటు. కాకపోతే యీజన్మ యిలా ఎందుకు తగులబడ్తుంది? మీరు రండి....! హృదయములో దాచుకుంటాను. విడువను. దేవుడు అడ్డువచ్చినా సరే! అతనికిమాత్రం ఏం అధికారం మనమీద? అధికారం వున్నవాడైతే మనమధ్య యీ అగాధం....అబ్బ లోకంలో నేనొక్కదాన్నేనా....! యింకా ఎవరన్నా ఉన్నారా నాలాగ! మీరుచెప్పండి ఎందుకింత మౌనం? హృదయవీణను ఆలాపించి పారిపోయారు.... ఇప్పుడది కాలి బూడిదవుతుంది, ఎప్పుడొస్తారు? యీ బూడిదమీద మీ ఒక్క కన్నీటిచుక్క చాలు.... అదే అమృతం.... మీపాదగుర్తు చాలు.... దాన్నే పూజిస్తాను మీమీది ఆశ నన్ను నిరాశ పరుస్తుంది. ఎలాగో రాస్తున్నాను చచ్చిపోయి. సిగ్గువిడిచి.... అభిమానాన్ని చంపుకొని.... నా బ్రతుకుకు మీరిచ్చిన కానుక.... ధన్యురాలిని.

అంతా తమాషాలా జరిగిపోయింది. మనపెళ్ళి బొమ్మల పెళ్ళి....! బొమ్మలకు కోరికలుండవు. దిగులుండదు.... నరకంలోపడి ఏడ్వరు మనం బొమ్మలమన్నా కాకపోయాం! ఈ బాధలుండేవికావు.... అయినా యిప్పుడుమాత్రం ఏం? నేను బొమ్మనే.... నాలో ప్రాణంలేదు—కోరికలున్నా చంపుకున్నా.... దిగులు, ఆవేదన నరకం— అబ్బబ్బ! తలుచుకుని నాబాధ యింకెవ్వరికీ చెప్పుకోను. అందుకనే మీకు రాస్తున్నాను.... చెప్పలేను. మీకన్నా జాలికలుగుతుందేమోనని! యింత నిర్దయులా మీరు? క్షమించండి.... నేనలా అనుకోను. ఒక్కసారైనా కనిపించిపోండి అక్కయ్యకు వొంట్లో బాగులేదు.... నన్ను చూసి ఏడుస్తుంటుంది నేనెట్లా వుండను. నాముఖం ఆమెకెట్లా చూపించను? ఆమె లేనిది నేను లేను.... మీరులేంది నేను లేను మరి నేను లేంది....? ఏచెయ్యండి....

మీ

రాధ.

మీ కు....

అక్కయ్యకు చాలా సీరియస్‌గావుంది. మిమ్మల్ని కలవరిస్తుంది.... రండి నా అక్కను రక్షించండి....! ఇంతకంటె మీ కెట్లా చెప్పుకోను నా ఆవేదనను? ఎక్కువ యింకేం రాయలేను.... మీకాళ్ళు పట్టు కుంటాను.... నన్ను నరకండి. కాని ఒక సారి వచ్చిపోండి ఒకేసారి....

మీ

రాధ

"ఛీ! ఏం మనుషులు.... మా మీద యింత విరక్తి కలిగిందా! మానవుడై పుట్టగానే సరిపోదు. ఎదుటివాడి హృదయాన్ని, బాగోగులను విచారించలేనివాడు మానవుడుకాదు మానవత్వం .... క్షమించండి.... ఉద్రేకంలో ఏదేదోరాస్తున్నాను. జీవితంలో చాలావరకు చితికి పోయాను. మీకేం తెలుసు? సుఖంగా వుండండి.... అక్కయ్య చావు బ్రతుకుల్లో వుంది.... మాయదారిరోగం....

మీ

రాధ

పరంధామయ్య ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నాడు.

బైట చింతచెట్టు రెమ్మల్లోంచి గాలి గదిలోకి దూరి అతన్ని కల్లోల పరిచింది.

వణకుతున్న చేతులతో మరో ఉత్తరం విప్పాడు.

శ్రీవారి

పాదపద్మాలకు నమస్కరిస్తూ

గత ఉత్తరాల్లో నేనేం రాశానో నాకేం జ్ఞాపకంలేదు. అయినా అందులో మీకు బాధ కలిగించే మాట లేమైనా వుంటే నన్ను క్షమించండి. ప్రస్తుతం మీ దగ్గర్నుంచి యింతకంటె వేరే యింకేం కోరను. నా గురించి ఎప్పుడైనా మీరాలోచిస్తే, దయ చూపగలిగితే ధన్యురాలివి. అక్కయ్య చివరి శ్వాస మీ జ్ఞాపకంలోనే అంతమైంది.... యిదిగో- ఆమె మీకో ఉత్తరం ఇచ్చింది. ఎప్పుడైనా వస్తే యివ్వమని. మీ రొచ్చే దాకా నేనుంటానో. వుండనో నాకు నమ్మకంలేదు. అందుకనే దీన్ని ముందుగా పంపిస్తున్నాను శెలవు.

మీ

రాధ

పరంధామయ్య ఆ ఉత్తరాన్ని కూడా విప్పాడు.

చక్రవర్తికి-

ఆశీర్వచనములు

నీకు నిన్ను ప్రేమించినవారంటే అసహ్యం కలిగించేదేమో! ఇది నీ పొరపాటు కాదు. సహజం కాని తన్మయురాలై నీ పాద పూజకోసం తపించే నా రాధిని ఒక్కసారి జ్ఞాపకానికితెచ్చుకొని వచ్చిపో. నీ జ్ఞాపకంలో అశ్రువుల జాలు వారుస్తుంది. ఇది "సత్యం" అని గుర్తించిననాడు నీ జీవన సంగీతం యిక్కడుందని మరచిపోకు. అప్పటిదాకా నేను బ్రతుకను. అందుకే యీ ఉత్తరం.... మరచిపోకు

నీ

దేవి

పరంధామయ్యకు స్పృహ వచ్చినంత పనైంది సర్వాన్ని దోచుకుంటున్న విధి మీద తీరని కసి పుట్టింద. ఆవేశంతో వణికిపోయాడు. గోడకు తగిలించిన చక్రవర్తి ఫొటో అలా నవ్వుతూనే వుంది.

శ్రీవారికి-

జీవితంలో నాకుమిగిలిందల్లా మీ రొక్కరే! ఈ మేడ, యీడబ్బు, ఈ భోగభాగ్యాలు నా కనవసరం. కనీసం యిప్పుడైనా అనుమతివ్వండి- మీదగ్గరి కొస్తాను. ఎలాంటికష్టాలైనాఓర్చుకుంటాను మీరు నాకు అండగా వుంటే యీ ప్రపంచాన్నే జయిస్తాను.... అవును! నాకింత పిచ్చినమ్మకం.

సమాజంలో ఒంటరిగావున్న స్త్రీకి ఎలాంటిగౌరవం లభిస్తుందో ఊహించండి మీరైనా రండి.... వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తుంటాను.

మీ

రాధ

పరంధామయ్య కన్నీళ్లు తుడుచుకున్నాడు.

శ్రీవారికి

నా అంచనా ప్రకారం యింకా నే నెక్కువకాలం బ్రతకను! అయినా యీ బ్రతికి నన్నాళ్లు మీ పాదపూజ చేసుకునే భాగ్యం లభిస్తుందో లేదో భయంగా వుంది. మా వారు యింత నిర్దయులు కారని రాత్రి కలలో అక్కయ్యతో చెప్పాను అక్కయ్య నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

'జీవితం' అంటే విసుగ్గాలేదా మీకు? పరంధామయ్యతో జరిగిందంతా చెప్పేయండి మీరు చెప్పలేకపోతే నేను చెప్తాను. అనుమతివ్వండి.... పరుగెత్తుకువస్తాను....

మీ

రాధ

చివరి ఉత్తరాన్ని విప్పాడు

శ్రీవారికి-

జీవితంమీద, అక్కడి వాతావరణం మీద చికాకు, అసహ్యం కలిగిన్నాడు నా దగ్గరికి పరుగెత్తుకొని రండి. మీకోసం నా కళ్ళు అన్ని వేళ్ళలా ఆహ్వానిస్తాయి.

గాలి వీచి ఆకు కదిలినా మీ రొస్తున్నారేమోనని గేటు కావల రోడ్డు మీదేనాదృష్టి. వచ్చేయండి.... రోజులు దగ్గరౌతున్నాయి. మీ రాధ మరణిస్తుంది.... వచ్చెయ్యండి"

మీ

రాధ

పరంధామయ్య కళ్ళు చెరువులయ్యాయి.

నిశ్శబ్దంగా ఏడ్వలేక గొంతు చించుకొని ఏడ్చాడు కొంతసేపు.

గదిలో గాలి స్తంభించింది.

అది మోసుకొచ్చిన సంతోషాలన్నీ విషాదాలయ్యాయి. బరువుగా, ఆవేదనగా వెళ్ళిపోతుంది.

అయినా గోడమీది చక్రవర్తి ఫొటో తనకు పట్టినట్లుగా చిరునవ్వు నవ్వుతోంది. పరంధామయ్య ఉత్తరాలన్నీ టేబుల్ సొరుగులో జాగ్రత్తగా దాచిపెట్టి రాధకు ఉత్తరం వ్రాయటం మొదలెట్టాడు.

రాధమ్మకు-

పరంధామయ్య ఆశీర్వచనములు.

ఏదైతే చేయాలనుకున్నానో అదే చేసున్నానమ్మా- యీరోజు నా కళ్లు తెరిపించావు నా కోడలు యింత ఉత్తమురాలని ఊహించలేకపోయాను. నా కొడుకు యింత అదృష్టవంతుడనుకోలేదు. కాని అంతా సర్వనాశనమైపోయింది అంతా!

ఇన్నాళ్లు నా ప్రాణప్రదంగా పెంచుకున్నాను- ఆ మమకారమన్నా చూపించలేకపోయాడు నా రాజు ఇక నీతో ఏ విషయాన్ని దాచను. ఒకవేళ నువ్వే నా స్థితిలో వుంటే ఏం చేసేదానివో యీ ఉత్తరం పూర్తిగా చదివిన తరువాత చెప్పు-

కష్టాల్లో పుట్టి, కష్టాల్లోనే పెరిగాను నేను. చాలా చిన్న వయసులోనే- జీవితంలో ప్రతీక్షణం ఎంత విలువైందో, దాన్ని ఎలా వినియోగించుకోవాలో నాన్న నాకు బాగా నూరిపోశాడు. కుల-మతాభిప్రాయాలమీద మంచి పట్టుదల చూపేవాడు మా నాన్న. అతను గీచిన గీఁ దాటకూడదనుకొని, అతని ప్రతీమాట నీతి, నిజాయితి అని నమ్మే రోజుల్లో ఒక వింత సంఘటన జరిగింది. ఆ సంఘటన నన్ను మా నాన్నను వేరు చేసింది.... నిర్దయగా ప్రవర్తించినందుకు ప్రతిఫలం అనుభవిస్తున్నాను.

అనాలోచితంగా దేనికీ సిద్ధపడగూడదు ఒకవేళ అలా సిద్ధపడితే అన్నింటినీ తెగించి సుఖంగా బ్రతకటానికి ప్రయత్నం చేయాలి. కాని నాతండ్రిని వేరుచేసి మమతల్లో నిప్పులుపోసిన ఆ రాజ్యాన్ని నేనెన్నడూ సుఖపెట్టలేదు నేను పెళ్ళిచేసుకుంది ఒకకులంలేని పిల్లను.

ఎన్నో కట్టుబాట్లలో పెంచి పెద్దచేసిన నాన్నను, అతనికిష్టంలేని కులంలేని అమ్మాయిని పెళ్ళిచేసుకున్నందుకు నేను చేసిన తప్పుకు జీవితాంతం ఊపిరి తీసుకోలేకపోయాను. ఇలాగే చావాలనుకున్నాను.

కులంకొని పిల్లయినా నారాజ్యం మనసు గొప్పది. నేను ఎలాంటి మాటలన్నా ఎన్ని కష్టాలు పెట్టినా ఎంతో ఆనందంగా స్వీకరించేది.... నోరెత్తేదికాదు.

ఇంతలో కళ్ళు తెరువని పసిగుడ్డు.... నా వంశానికి వెలుగు.... నారాజు పుట్టాను. కాని ఎప్పుడూ నానీడకూడా వాడిమీద పడనిచ్చేవాడినికాదు. నోరార వాడిని 'రాజూ' పిలవలేదు. ఆ మమతను, అనురాగాన్ని లోపలే అణచుకుంటూ ఎంతో గంభీరంగా బ్రతకటం అలవాటు చేసుకున్నాను. కాని నాకన్న పదిరెట్లు ఎక్కువ బాధ పడుతూ, తన అదృష్టంమీద కన్నీళ్ళు కారుస్తూ— తన రక్త-మాంసాలను పంచుకొని పుట్టిన నా రాజును గుండెలకదుముకుని ఏడ్చిఏడ్చి కాలిపోతున్న ఆమెను ఎప్పుడూ గమనించలేకపోయాను.

మానసికంగా ఆమె మోసిన బరువును ఏ స్త్రీ మోయలేదు. చివరికి మరణవేదిక ఎక్కే పరిస్థితి వచ్చినా తన బాధను చెప్పకోలేకపోయింది. చివరి శ్వాస తీసుకుని నా కాళ్ళమీద తల ఆనించి.... "నా రాజు మీకెప్పుడైనా జ్ఞాపకానికి వొస్తే ఒకసారి మీ చేతులతో ఎత్తుకొని వాడిని ముద్దాడండి" అంది.

ఆమె ఏడుస్తుంటే శరీరంలో ఒక్కొక్క రక్తపుచుక్క తనకూ, యీ శరీరానికి సంబంధంలేకుండా కాలిపోసాగింది.

"వాడిని మీ యిష్టమొచ్చినట్లుగా.... పెంచండి.... నన్ను పెళ్ళాడి సుఖపెట్టలేకపోయినా మీ రక్త-మాంసాలను పంచుకొని పుట్టిన వాడి ముఖాన్ని ఒక్కసారైనా చూడండి....!" అంది చివరిసారిగా.

నిర్మానుష్యమైన యీ యింట్లో అప్పుడప్పుడు నారాజు ఏడుపుతప్ప యింకేమీ మిగల్లేదు నాకు. పడగవిప్పిన వేదన బరువైన నిట్టూర్పులతో యిల్లంతా విపర్ణమయ్యేది.

నాన్న నన్ను పెంచినట్లు నా రాజుకు కూడా నేను ఎంతో కట్టుదిట్టంగా పెంచసాగాను. చివరికి నాఆశలన్నీ వాడిమీదనే పెట్టుకున్నాను. పెద్దచదువులు చదివించి పెద్ద పేరు సంపాదిస్తాడని ఆశ పడ్డాను. ప్రతీ తండ్రి పెట్టుకొనే ఆశలన్నీ నేను పెట్టుకున్నాను. నిప్పుల్లో కష్టపడి వాడికి నెల నెలా డబ్బు పంపించాను. కాని భవిష్యత్ యింత గంభీరంగా, నిర్దయగా వుంటుందనుకోలేదు. చివరికి నా కొడుకు కూడా నాలాగే ఒక కులంలేని అమ్మాయిని పెళ్ళిచేసుకుని తాను ఒప్పిస్తానికి ప్రయత్నిస్తాడని కలలోకూడా అనుకోలేద. నేనంటే వాడికి అంత నమ్మకం ఎలా కలిగిందో యిప్పటికీ నాకర్థంకాలేదు.

ఆనాడు నారాజు నా దగ్గరకువచ్చి యీ విషయం నాతో చెప్పాడు. బ్రతుకు భరించరాని అభిమానంతో చితిలా కాలింది.... అంతులేని పిచ్చిఅభిమానం నా ముకుటాన్ని యిష్టమొచ్చినట్లు కొట్టింది.

"ఛీ! ఏభూమికొపంట! దానికి ఎంత సాగుబడిచేసినా ఏం లాభం? పాడుబుద్ధి పోనిచ్చావుకాదు. యిన్నేండ్లు నిన్ను పువ్వుల్లోపెట్టి పెంచినందుకు యిదే నాకిచ్చే ప్రతిఫలం? నువ్వు సుఖపడుతూంటే జన్మ-జన్మలవరకు నిన్ను చూసుకుంటూ నా కల్మష జీవితాన్ని మరచిపోవాలనుకున్నాను. కాని దాన్ని నువ్వు తిరిగి తట్టిలేపి నాలో ఆరని మంటల్ని ముట్టించావు. ఛండాలుడా! పో.... వెళ్ళిపో.... నాకళ్ళముందు వుండకు.... నాకు కనిపించకు.... వెళ్ళు....!" అంటు కేకలేశాను.

ఇన్నేండ్ల తరువాత వాడిమీద నా అనురాగం ఒళ్ళంతా కల్మశం పూసుకుంది. నా మాటలు విని అడుగైనా ముందుకు వెయ్యలేని నారాజు నా రూపాన్ని చూచి విచలితుడయ్యాడు.

నా మాటల్లో నీతి, నిజాయితీ వుందనుకున్నాడు. వాటిని దాచుకుని ఆరాధించే నా వంశపు మెరుగు నాకు నేను మరచిపోని ప్రతిఫలాన్నిచ్చాడు,

"నీకిష్టంలేని పని నేనెన్నడూ చేయను నాన్న! యిన్నేండ్ల తరువాత నువ్వు క్షమించలేని పెద్ద పొరపాటు చేశాను. నేననుకున్నదంతా ఒట్టిభ్రమ, ఆ భ్రమను ఆధారంగా చేసుకునే నేనింత పెద్దనేరాన్ని చేయగలిగాను. ఇప్పుడు దాన్ని మోయలేను నిన్ను బాధ పెడ్తూ నేను జీవించలేను...."

సానుభూతి చూపలేకపోయాను.

అసహ్యించుకున్నాను.

క్షమించలేకపోయాను,

నికృష్టపు బ్రతుకు బ్రతికేకన్నా చావ మని చెప్పాను.

మనిషిమీద పెద్ద అభిమానం వుంచు కున్నవాడు తొందరగా మరణిస్తాడు రాధమ్మా! అంతమూగభక్తి కొడుకుకు తండ్రిమీద వుండకూడదు.

ఏదో చెప్పాలనుకున్నాడు నా రాజు. చెప్పలేకపోయాడు. ఆరాత్రి నిశ్శబ్దంగా నిద్రపోయాడు....

డైరక్టరుకూడా ఊహించని విధంగా నారాజు నాకు కాకుండా పోయాడు. నా అవసరం తీరిపోయింది వాడికి.

వాడు మరణిస్తే నేను నవ్వుతూ బ్రతుకుతాననుకున్నాడు నా పిచ్చిబాబు!

అంతకన్నా వెయ్యి రెట్లు బిగబట్టింది విధి

అంతా ప్రవాహం.... ఆ ప్రవాహంలో పడి దాన్ని జయించిన వాడిదే జీవితం.... కాని గడ్డి పరకకన్నా అన్యాయమైపోయింది యీ జీవితం....!

నా దగ్గరికి వచ్చేయ్ రాధమ్మా! నిన్ను చూసుకుంటూ వాడినన్నా మరచిపోతాను. నా కళ్ళు తెరిపించావు.... కాని నీ భాగ్యా తీరని అన్యాయం చేశాను.... వచ్చేయ్ తల్లీ.... యీ ముసలివాడి బాధ నీకర్థం కాదు.... చెప్పుకోలేను.... రా.... తల్లి.... వచ్చేయ్.!

పరంధామయ్య

* * *

గాలికి నిశ్శబ్దంగా కదిలే గడ్డిపోచలా తెల్లటి తెరక్రింద లోకమంతా మైమరచి నిద్రోతుంది.

ఆ వెన్నెట్లో సరదాగా సెలయేటి ఒడ్డున యిసుకలో గీతలుగీస్తూ కూర్చున్నాడు చక్రవర్తి.

మందంగా వినిపించే సెలయేటి ధ్వని తప్ప అంతా నిశ్శబ్దం- ఇసుకలో గీచిన గీతలమధ్య 'దేవి' అని రాసి చిన్నగా నవ్వుకున్నాడు.

వెన్నెల వెలుగులకు ముగ్ధుడైపోయాడు

తలెత్తి చూసేసరికి ఎదురుగ్గా ఆమె కనిపించింది. భయంతో గీతలమధ్య రాసిన పేరును చెరిపేయాలనుకున్నాడు. కాని ఆమె అతని చేతిని పట్టుకుంది.

"రాధీ!" వినీ వినిపించకుండా అన్నాడు చక్రవర్తి,

రాధ నవ్వింది.

"నువ్వెందుకొచ్చావిక్కడికి?"

"నాకు పనుంది!"

ఆమె అతనివైపు చూడనట్లు నటిస్తూ- "నాకు తెలుసు- ఎంతకాలం యిలా బాధ పడ్తారు?" అన్నది.

"బాధా....! చిన్నగా నవ్వి- "నాకేం బాధ లేదు- అలా అనుకుని నువ్వు బాధ పడకు.... రాధీ నువ్వు వెళ్లు!"

"పుట్టింది పోవటానికే.... కాని.... మిమ్మల్ని వదలి ఎలాపోను?"

కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయాయి....

"రాధీ! ఎందుకు నన్ను ఏడిపిస్తావు? నువ్వు వెళ్ళురాధీ....వెళ్ళు!"

"ఇదేప్రశ్న మిమ్మల్ని ఎన్నోసార్లు అడగాలనుకున్నాను....!" గొంతు సుళ్ళు తిరిగింది.

"కాని నువ్వు అడగవని నాకు మంచి నమ్మకం!"

రాధ పెదవులు బిగపట్టింది.

"వెళ్ళు రాధి...."

"అంత అసహ్య పడుతున్నారా నన్ను చూసి? నేనేం చేశాను? మీ చూపుకోసం యింకా ఎన్నాళ్ళు యిలా తపించను.... రండి.... మనం వెళ్దాం?"

ఆమె మాటల్లో స్వార్థంలేదు. ప్రేమించిన స్త్రీ అనగలిగిన మాటలు.... ఎంతో ఓపిగ్గా అంది, బాధను దాచుకోవాలని ప్రయత్నిస్తూ.

"అలాంటిదేంలేదురాధీ....!" అంతకు మించి అతను యింకేం అనలేకపోయాడు. ఒకసారి ఆమెను చూశాడు గాజుముక్కను చూసినట్లు.

"అంతేనా....?"

"రాధీ! ఎందుకు నన్నిలా మాటల్తో ఈడ్చుకుపోవాలని ప్రయత్నిస్తావు? నువ్వు వెళ్ళు....వెళ్ళు!"

ఆమె లేవబోయింది.

"రాధీ! నిన్ను కష్టపెడ్తున్నాను కదూ!"

ఆమె చేతిని పట్టుకొని అడిగాడు అంతలోనే. లేవాలనుకున్నరాధ అలాగే అతని మీద పడిపోయింది.

కన్నీటికాలువ బండరాళ్ళ మధ్యనుంచి జారిపోతుంది.

చక్రవర్తి ఆమె ముంగురులు సరిదిద్దుతూ.... "వెళ్ళకు రాధీ.... వెళ్ళకు.... యిక్కడే వుండిపో.... నిన్ను కష్టపెట్టను. నా రాధీ?" అన్నాడు.

ఆమె తన చెంపను అతని భుజానికి ఆనించి "నిజంగానా!" అంది వినిపించేలా

"కాదు.... మోసం!" అంటు ఆమె తలను తన ఒళ్ళోకి లాక్కున్నాడు.

రాధ సిగ్గుగా రెండుచేతులతో తన ముఖాన్ని దాచుకుంది.

ఒకటి.... రెండు నిమిషాలు....

అతను తన చేతుల్ని విడదీసి తనతో మాట్లాడ్తాడనుకుంది. కాని మౌనంగా కళ్ళు తెరచింది.

ఒట్టి నేలమీద పడుంది.

దూరంగా చక్రవర్తి నడిచిపోతున్నాడు వెన్నెట్లో అతని నీడ అసహ్యంగా ఊగుతూ-తూగుతూ అతని వెనకాలే పోతుంది. జీవితంలో అతనికోసం అలంకరించుకున్న అందాలన్నీ ఆవేళంతో ఊగిపోయాయి. కాని అతనికి ఆమె అందాలు కనిపించలేదు. ఆమె అలంకరణ అర్థంకాలేదు. అతనివెనకాలే పరుగెత్తింది

"మీరుపోవద్దు.... ఆగిపోండి.... ఆగిపోండి!" అంది రాధ.

చక్రవర్తి ఒకసారి వెనుగిరిగిచూశాడు.

రాధకు తన అలంకరణమీద తనకే అసహ్యమేసింది. రోషంతో అంతా చెరుపుకుంది.

ఎవరో ఆమెను బలంగా వెనుకకు తోశారు

రాధ పడిపోయింది,

కళ్ళుతెరచి చూసింది.

ఎదురుగ్గా దేవి కనిపించింది,

"అక్కా....!" ఇన్నాళ్ళు దాచుకున్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది.

దేవి నవ్వింది,

"సిగ్గులేదు?"

"సిగ్గా! అదేమిటి అక్కా.... నువ్వేనా మాట్లాడుతుంది?"

"ఎందుకు- అతను కాదన్నా అతని వెనకాల పిచ్చికుక్కలా పరుగెత్తుతావు? వెళ్ళు.... వెనక్కు వెళ్ళిపో ....!" అంది కోపంగా దేవి.

"లేదక్కా....లేదు! ఒంటరిగా వెళ్ళను మరణించినా సరే అతని కాళ్ళ దగ్గరపడి మరణిస్తాను.... కాని వెనక్కు వెళ్ళను.... నన్ను పోనివ్వు....!" అంటూ లేచి ఒక అడుగు ముందుకేసింది.

"నా మాట కాదనకు-!"

"క్షమించు అక్కా! ఇది నా జీవిత సమస్య.... నన్ను వెళ్ళనివ్వు.... నీకాళ్ల

"ఛీ! పాపిష్టిదానా! వదులు! నీకి అ్పర్తతకూడా లేదు....!" అంటూ దేవి వెనుకకు తూలి నిలదొక్కుకుంది.

రాధ లేచి నిల్చుంది;

"నువ్వు నా తల్లి కడుపున పుట్టిన దేవివి కాదు.... దయ్యానివి.... నా దేవుడి మీద నీదేం అధికారం? నా దారి వదులు!" అంది కోపంగా రాధ.

"వెళ్ళనివ్వను!"

ఎట్లాగైనా వెళ్ళాలనుకుంది రాధ.

"వెళ్ళి తీరుతాను....!" అంటూ ఆమెను తప్పించుకొని పరుగెత్తింది.

ఎంతసేపు పరుగెత్తినా చక్రవర్తి ఆమెకు దూరమౌతున్నాడు.

"ఆగండి.... ఒక్క నిముషం.... అయ్యో!" తలబాదుకుంది రాధ.

ఆమె కెదురుగా దేవి నవ్వుతున్నది.

"అక్కా! నువ్వన్నా చెప్పు.... నా దేవుడు.... ఒక్కసారి మాట్లాడమనక్కా నీ కాళ్లు పట్టుకుంటాను.... నాకు వారిని దూరం చేయకు.... అక్కా!" అంది.

సహజంగా స్త్రీని అర్థం చేసుకునే స్త్రీ మనసు కరిగింది. కన్నీళ్ళు పొంగాయి. వేడి నిట్టూర్పులకు వెన్నెల కాలిపోయింది

చుట్టూ పొగలు....

రాధకు ఎవరూ కనిపించలేదు. ఆమెకు తను గాలిలో తేలిపోతున్నట్లుగా అనిపించింది—

భయంతో కేకలేసింది,

చివరికి స్పృహతప్పి పడిపోయింది. కళ్ళు తెరచేసరికి చక్రవర్తి ఒడిలో పడుకునుంది.

"రాధీ!"

"మీరా!" అంటూ బరువుగా కళ్ళు మూసుకుంది.

"నీకోసమే వచ్చాను కళ్ళుతెరు రాధీ" అన్నాడు చక్రవర్తి.

"నాకోసమే! నా దేవుడికి దయ కలిగింది!" లోలోన ఉప్పొంగింది.

"ఇన్నాదలి ఎక్కడికెళ్తాను రాధీ!"

రాధమనసు మళ్ళీతెక్కింది. నిజంగానే నారాజు నన్నొదలి ఎక్కడికెళ్తాడు?" అనుకుంది.

"నువ్వు లేంది నా కెందుకీ జీవితం.... పారిపోయొచ్చాను. పట్టుకో.... విడువకు"

"వద్దు - వద్దు! యింకా మాట్లాడకండి.... యీ ఆనందాన్ని భరించలేను. వెళ్దాం.... నాతో రండి!" అంటూ లేచి నిల్చుంది.

చక్రవర్తి కళ్లు మెరిశాయి

"ఎవరికీ కనిపించనిచోటికి, ఎవరూ రాని చోటికెళ్దాం....!"

నవ్వాడు చక్రవర్తి.

రాధ అతని చేతి నందుకుంది.

విపరీతంగా చలేస్తుంది.

ఇసుకలో చాలాదూరం నడిచిపోయారిద్దరూ....

"ఇంకా ఎక్కడికి రాధీ?"

"రండి.... యింకా కొంచెందూరం!"

పదినిమిషాలు మౌనంగా నడిచారిద్దరు.

వాళ్ళువేసే ప్రతీ అడుగు ఒక అనుభవంలా నిలిచిపోతుంది యిసుకలో.

"చూశారా! ఆమేడ ఎంత అందంగా వుంది! అక్కడికి ఎవ్వరూరారు— మన శ్వాసలు మనకు వినిపించవు." అందిరాధ.

"మన మాటలు కూడానా!" అంటూ నవ్వాడు చక్రవర్తి.

రాధ మామూలుగా నవ్వింది.

గాలి తుపాను....

ఇసుక పొగలా లేచింది.

"రాధీ!" చక్రవర్తి గొంతు రవ్వంత వొణికింది.

రాధ జవాబివ్వలేదు.

మత్తుమందిచ్చిన మనిషిలా తూలి ఇసుకలో పడిపోయింది.

"రాధీ!" అంతకంతకు దూరమౌతున్నరాధను చాలా సార్లు పిల్చాడు చక్రవర్తి.

కాని రాధ సమాధానమివ్వలేదు.

"నువ్వురా! రాధగురించి విచారించకు నారాజూ! చూడు. బ్రతికి సాధించలేంది చచ్చి సాధించాను. నువ్వు నా వాడివే! నా కళ్ళలోకి చూడు! నువ్వలా చూస్తే చెప్పరాని సిగ్గుతో నాకళ్ళు మూసుకో పోతాయి. నిజం. నువ్వు నమ్మవు. బ్రతి కున్నప్పుడు నీ కాళ్ళమీద పడి నిన్ను నా వాడ్నిగా చేసుకోవాలను కున్నాను. కాని ఆలస్యమైంది.... మరోనాడు....అన నుకునేదాన్ని! కాని రాధ నిన్ను నాకు కాకుండా చేస్తుందని ఊహించలేదు. ఎట్లా ఊహిస్తాను?"

తనను పట్టుకున్న దేవి చేతిగోళ్ళమీద చూపులు నిలిపి.... "లోకాలు మారినా మనసులు మారలేదు దేవి.... నేనెవరికి మిగలకుండా మరణించాను...."

మాట మధ్యలోనే అందుకుంది దేవి- "నేను బ్రతికించుకున్నాను నిన్ను.... నువ్వు మరణించలేదు. నిజం.... నేనెలా చెప్పుకోను? రాధకోరికను తీర్చి నా జీవి తాంతం నీ వియోగంలో కాలిమరణించాను ఇది స్వార్థం అవొచ్చు....! అయినా నీ కోసం మరణించి నువ్వొస్తావని ఎదురు చూశాను. నువ్వొచ్చావు. ఇక్కడకూడా నాకు కాకుండా పోతావా రాజూ! వచ్చెయ్ ఇందులో యింకా వేరే ఆలోచన లేదు.... నాలో దాయగల రహస్యాలేమి లేవు.... ఇన్నాళ్ళు వున్నా అవి చెప్పుకోలేనివి...."

చక్రవర్తి మాట్లాడలేకపోయాడు.

దేవి అద్వర్‌టైజ్ బొమ్మలా నవ్వింది

చక్రవర్తి పెదిమలు కదిలాయి.... ఏం మాట్లాడాడో అతనికి తెలీదు.

దేవిమాత్రం ఆకర్షవంతంగా నవ్వింది.

భుజంమీదవేసిన రాజుచేతిని తన చేతు ల్లోకి తీసుకొని మృదువుగా.... "ఇహ ఎప్పుడూ నన్ను విడువకు" అంది

ఇద్దరు చాలాదూరం వెళ్ళిపోయారు....

ఇప్పుడా ఎడారిలేదు....

ఏదో కొండ.... కొండ కొన మీద దేవాలయం.... యిద్దరూ పై మెట్లమీద కూర్చున్నారు.

"బ్రతుకు సుళ్ళు తిరిగింది.... అంతా ఏడుపే!" చిన్నచిన్న రాళ్ళు విసరేస్తూ అన్నాడు చక్రవర్తి.

"నేనే తొందరపడ్డాను .... కోరికల్ని కాల్చుకుని బ్రతుకుతీగెల్ని తెంపుకున్నా"

ఆమె మాటలు చక్రవర్తి గుండెల్ని పొగలవాగులతో ముంచెత్తాయి.

బొమ్మలా కూర్చున్నాడు....

గాలికి అప్పుడప్పుడు రాలిన ఆకుల గలగలలు.

కొండకింద ఎవరిదో నల్లని ఆకారం మెట్లు ఎక్కుతుంది....

"అదిగో రాధ వస్తుంది.... ధైర్యంగా చెప్పెయ్.... నీమాట కాదనదు.... వెళ్ళి పోతుంది!" అంది దేవి.

వెన్నెట్లో నీడ పరుగెత్తుకు వస్తుంది

చితిలో కాలి కళేబరపు ఒట్టి ఎముకలు మిగిలినట్లుగావుందా ఆకారం. అయినా అప్పటికీ మృత్యువుతో పోరాడుతూనే వుంది.

దేవి రెండుమెట్లు దిగి చక్రవర్తికి అడ్డంగా నిలబడింది.

ఆయాసపడ్తూ వచ్చిన రాధ చికాగ్గా కళ్ళు చిలికించి చూసింది దేవిని.

"ఏమిటి? నన్నెందుకు మధ్యలో ఆపు తావు? నా దేవుడికోసం నేను రావటం తప్పా? మధ్య నువ్వెవరివి? మాయలి మారి.... నన్ను పోనివ్వు!" అంది రాధ.

దేవి సమాధానంగా చిరునవ్వునవ్వింది.

"నన్ను పరీక్షిస్తున్నావా? వద్దక్కా! యిప్పటికైనా మానెయ్యి.... యింకా ఎక్కువ క్షణాలు బ్రతకను.... నా దేవుడి పాదాలకు మొక్కుతాను ... నన్ను వదులు నన్ను వదలక్కా!" అంది.

ఆమె మాటల్లో ఆవేదనలేదు. చావు- బ్రతుకుల్లో నీరసంగా మాట్లాడే రోగి గొంతులా వుందామె గొంతు.

"నిన్నెక్కువగా అడగను.... నీకు నామీద దయకలగకపోతే అది నా దురదృష్టం....కాని ఆనాడు సంతోషంతో నువ్వే నీ చేతులతోనే యీ నుదుట నా భాగ్యాన్ని అలంకరించావు దాన్ని నీ చేతులతోనే చెరిపెయ్యి.... ఆలోచించకు. ఆ క్కా జీవితం చల్లబడింది.... అంతా నిశ్శబ్దం!"

దేవి తలవంచుకుంది....

"నేను బాధ పడటమే నీకు ఆనంద మైతే అలాగే కానివ్వు....! నన్ను చంపు- చిత్రవధ చెయ్యి నా దేవుడిముందు. చివ రికి నా దేవుడి మనసైనా కరుగుతుందేమో అలా జరగకపోయినా ఫర్వాలేదు. వారి జ్ఞాపకంలో చివరి క్షణాలవరకు తృప్తి కానివ్వు—!"

దేవి మౌనం వహించింది.

"ఇందులో నువ్వేది చెయ్యలేకపోయినా నన్ను పోనివ్వు. నిన్ను పూజిస్తాను.... చివరిసారికైనా కళ్ళారా చూసుకుంటాను అక్కా!" అంటు ఒక అడుగు ముందు కేసింది....

"రాధీ!" పిడికిలి బిగించి దెబ్బతిన్న పులిలా అరిచింది దేవి.

"అవునక్కా! నీకు తెలీదు నాబాధ- నన్నాపకు.... నాదారి వదులు!" అంది.

"ఛీ! ఛండాలి! ఏముఖం పెట్టుకొని వచ్చావిక్కడికి— సిగ్గులేదు!" సాధ్య మైనంతవరకు గట్టిగా కోపంగా అన్నాననుకుంది దేవి.

రాధ శుష్కహాసం చేసింది.

"నిన్ను కన్న తల్లికడుపులోంచే నేను పుట్టాను దేవి! నావైపు చూడు.... నా కళ్ళలోకి చూడు.... అదే ప్రతిబింబం భగవంతుడు అచ్చుపోశాడు. నామీద నీ కెలాంటి మమతవున్నా నువ్వామాట అన లేవు.... నీతల్లి ప్రసాదించిన దురదృష్టపు ముఖం.... కాని అక్కవై ఆమాట అన్నందుకు కొంచమైనా బాధపడు. దుర దృష్టపు నా బ్రతుకుమీద ఒక్క కన్నీటి

చుక్క వదులు. నీతిగా ఒకరిమీద ఆశలు పెట్టుకొని బ్రతికేవాళ్ళకు సిగ్గు వుండదక్కా అవినీతిపరులకు సిగ్గు ఎక్కువ. నా దైవాన్ని నువ్వు దాచుకుని నన్ను తరిమివేయటానికి ప్రయత్నించకు.... చివరికి ఆ దైవంపాదాల దగ్గరే నేను మరణిస్తాను.'' అంటు అడుగు ముందుకేసింది రాధ

''ఆగు.... రాకు.... ముందుకురాకు.. పిశాచి పో.... వద్దు.... రాకు....పో....పో....'' కోపంగా అరిచింది దేవి.

ఒళ్ళంతా చెట్టుకొమ్మలా ఊగింది.

దేవిని దగ్గరౌతున్న కొద్దీ ఆమె ఊపిరి రాధను కాల్చేస్తుంది.

అయినా గాయాల్తో గుండెల్ని పొదివి పట్టుకొని ముందుకు అడుగువేస్తోంది రాధ

ఆమెకు ఒళ్ళు తేలిపోతున్నట్లుగా వుంది.

ఎవరో బలంగా ఆమెమీదికి కత్తులు విసురుతున్నారు గురితప్పకుండా అన్నీ వచ్చి గాయాల్తో నెత్తురుకారుతున్న గుండెలకు గుచ్చుకుంటున్నాయి

''పాపిష్టిదానా.... వెళ్ళు....వెళ్ళిపో.... వెళ్ళిపో....!''

రాధ చివరిమెట్టు ఎక్కింది!

పైన పౌర్ణమినాటి చంద్రుడు.

కళ్ళు మూసుకుపోతున్నాయి.

ఇనుపచేతులు ఆమె మెడను నలిపేస్తున్నై

''పిశాచి.... ముందుకురాకు.... వెళ్ళిపో పో....పో....!''

కళ్ళముందు అంతా చీకటి.

పిచ్చికోపంతో ఆమెచుట్టూ అందరూ అరుస్తున్నారు.

అడుగు వెనక్కు వేయాలనుకుంది.

కుడికాలు చివరిమెట్టుమీద పడింది.

ఆమె కళ్ళముందు వికారంగా ఏవో చేతులు ఊగుతున్నాయి.

'అక్కా' గట్టిగా కేక వేయాలనుకుంది. వేశాననుకుంది

వికారంగా ఊగేచేతులు ఆమె భుజాలు పట్టుకున్నాయి.

చేతులు పట్టరాని కోపంతో గట్టిగా ఆమెను క్రిందికి తోసేసాయి.

''ఛీ! పిశాచి.... చావు.... చావు....!'' కేకలు.

* * *

మేడమీద పడుకున్న రాధ.... ''అక్కా' అంటూఉలిక్కిపడి లేచి ముందు కురికింది

వరండాలోకొచ్చి దేన్నో పట్టుకోవాలనే తలంపుతో చేతులు చాసింది....

''అక్కా....అక్కా........!'' అంటు మేడమెట్ల మీదనుంచి జారి క్రిందికి దొర్లిపోయింది.

''చావు....పిశాచి....చావు....!''

రక్తపుమడుగులో కోరికలు, ఆశలు ముద్దలా చుట్టుకొపోయాయి

నుదుటవ్రాసిన గీత స్పష్టమైంది.

బైటగాలికి దిరిసెనచెట్లు ఆకులు రాలుస్తున్నాయి.

—o—

## మనవి

[ఈ సంచికతో ప్రచురణకు స్వీకరించిన పోటీకథానికలు పూర్తయ్యాయి. మేము ప్రచురించే కథల్లో ఏవి పోటీకి వచ్చాయో మేము తెలియజేస్తు వచ్చాం ఇందువలన మాకు వచ్చిన, మేము ప్రచురణకు స్వీకరించిన పోటీకథలస్థాయి ఎటువంటిదో పాఠకులే నిర్ణయించగలరు.

ఈకథల్లో కొన్ని ఉత్తమశ్రేణికి చెందినవి వున్నాయి మంచివీ వున్నాయి కొందరు మంచికథలు వ్రాయ ప్రయత్నించి. అనుభవం లేకపోవడం వలన, అంతగా కృతకృత్యులు కాలేకపోయారు, వారిని ప్రోత్సహించే ఉద్దేశ్యముతో వారి కథలు ప్రచురించాం.

ఈ పోటీపట్ల రచయితలు చూపుతున్న అభిమానాన్ని ఊతగాకొని, తిరిగి పోటీ నిర్వహించ దలచాం.

వివరాలు వచ్చేసంచికలో ప్రచురించగలం]

— సంపాదకులు.

## ★ జాగృతి కథానికల పోటీ ★

జాగృతి దీపావళి కథానికల పోటీలు ఈ ఏడాదికూడా జరుగుతున్నాయి. మొత్తం రు 1,256 లు బహుమతులు. సాంఘికాలకు రెండు బహుమతులు రు 50, రు 40 లు, పౌరాణికానికి రు 25 లు. చారిత్రికానికి రు 25 లు సాంఘికాలలో సినిమాకు ఎన్నికైన కథకు ప్రత్యేక బహుమానం రు 1,116 లు. కథలు చేరడానికి ఆఖరు తేది 10-10-63. గెలుపొందిన కథానికలు దీపావళిసంచికలో ప్రకటించబడతాయి. వివరాలకు ''సంపాదకులు జాగృతి, పో. బా. నెం, 363, విజయవాడ - 2'' కు వ్రాయవచ్చు.

మీ పాఠకులలోని కథకుల నందరినీ పోటీలలో పాల్గొనవలసిందిగా ఆహ్వానిస్తున్నాం.

— జాగృతి సంపాదకులు